సాక్షి కామారెడ్డి

సోమవారం ¦ 27 ¦ నవంబర్ ¦ 2023



కాంగ్రెస్ వస్తే కోతలే..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ కరెంటు కోతలు మొదలవుతాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు.

- 7లో ▸



సేవకుడిగా ఉంటా

తనను గెలిపిస్తే ప్రజలకు సేవకుడిగా ఉంటానని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు పేర్కొన్నారు.

- 6లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 33.6 /19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలిగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు బాన్సువాడకు జేపీ నడ్డా రాక

బాన్సువాడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బాన్సువాడ పట్టణానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రానున్నారని ఆ పార్టీ బాన్సువాడ అభ్యర్థి యెండల లక్ష్మీ నారాయణ తెలిపారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే సభలో నడ్డా మాట్లాడతారన్నారు. ఆదివారం ఆయన బాన్సువాడలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎల్లారెడ్డిలో దళితుల భూములను కబ్జా చేసి బాన్సువాడకు వచ్చారని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీని గెలిపిస్తే బాన్సువాడలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 25 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తామన్నారు. బాన్సువాడను జిల్లా చేసేందుకు కృషి చేస్తానని, బాన్సువాడ మీదుగా బీదర్ టు బోధన్ రైల్వేలైన్ కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. నడ్డా సభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

మద్నూర్‌కు..

మద్నూర్: మండల కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారిపై గల మైదానంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సకల జనుల విజయ సంకల్ప సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు ప్రకాశ్ నడ్డా పాల్గొననున్నారు. జుక్కల్ బీజేపీ అభ్యర్థి అరుణతారకు మద్దతుగా నిర్వహిస్తున్న సభలో ఆయన మాట్లాడతారని బీజేపీ నాయకులు తెలిపారు.

30న సెలవు

కామారెడ్డి క్రైం: ఎన్నికల సందర్భంగా ఈ నెల 30న ఓటు హక్కు వినియోగించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు, పరిశ్రమలకు వేతనంతో కూడిన కార్మిక సెలవు దినంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. పోలింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలుగా ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఉపయోగిస్తున్న విద్యా సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు ఈ నెల 29న అదనంగా సెలవు దినాన్ని ప్రకటించామని తెలిపారు. అయితే 29, 30 తేదీల్లో ఖజానా శాఖ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

రాజ్యాంగం భగవద్గీత లాంటిది



కామారెడ్డి క్రైం: భారత రాజ్యాంగం భగవద్గీత లాంటిదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనందరం సంతోషంగా జీవిస్తున్నామంటే అది రాజ్యాంగం చలవే అన్నారు. కుల, మత వ్యత్యాసాలు లేకుండా 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందన్నారు. ఈ నెల 30న జరిగే శాసనసభ ఎన్నికలలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. రాజ్యాంగ పీఠికపై అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్, అధికారులు పాల్గొన్నారు.

'కామారెడ్డిలో కమలం వికసిస్తుంది'

మాచారెడ్డి: బీఆర్ఎస్, కాంగ్రెస్లు ఓటుకు రూ. 10 వేలు పంచినా, మద్యం ఏరులు పారించినా కామారెడ్డి నియోజకవర్గంలో కమలం వికసించడం ఖాయమని బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాచారెడ్డి మండలంలోని పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే ప్రధానమంత్రి ఆశీస్సులతో కామారెడ్డిని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. అవినీతి లేకుండా నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తానన్నారు. ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

వ్యాపార వర్గాలతో కేటీఆర్ సమావేశం!

సాక్షి, కామారెడ్డి: ఎన్నికల నేపథ్యంలో మంత్రి కేటీఆర్ ఆదివారం రాత్రి వ్యాపార, వాణిజ్య వర్గాలతో సమావేశమయ్యారు. ఆయన సిరిసిల్ల నియోజకవర్గంలో రోడ్ షోలు ముగించుకుని రాత్రి కామారెడ్డికి చేరుకున్నారు. పట్టణ శివార్లలోని ఓ హోటల్‌లో రైస్ మిల్లర్లతోపాటు వివిధ వ్యాపార వర్గాలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో సహకారం అందించాలని కోరినట్టు తెలిసింది.



మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, వేదికపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, నేతలు మాణిక్‌రావ్ ఠాక్రే, డీకే శివకుమార్

ఆకాంక్షలు నెరవేరుస్తాం

- రేవంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించండి
- కామారెడ్డి విజయభేరి సభలో రాహుల్ గాంధీ
- సభ సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న 'ప్రజల తెలంగాణ' కలను నిజం చేయడానికి కామారెడ్డి ప్రజలు రేవంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఆదివారం కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన విజయభేరి సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. రేవంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడం ద్వారా తెలంగాణ ప్రజల కలలను సాకారం చేసుకుందామన్నారు. దొరలకు, ప్రజలకు మధ్య జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరుతుందన్నారు. మోదీకి వ్యతిరేకంగా పోరాడితే తనపై 24 కేసులు పెట్టారని, లోక్‌సభ సభ్యత్వం రద్దు చేసి, తన ఇంటిని లాగేసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ గెలిచి చూపించిన తర్వాత బీసీ సీఎం హామీ ఇవ్వాలన్నారు.

రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం, అవినీతిపై ఫోకస్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, ఉద్యోగ నియామక పరీక్ష పత్రాల లీకేజీలు, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంల మధ్యనున్న అనుబంధం తదితర అంశాలపై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబానికి మాత్రమే మేలు జరిగిందన్నారు. తెలంగాణ సంపద అంతా వాళ్ల జేబుల్లోకి వెళ్లిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారని, ఆ పార్టీకి వీడ్కోలు పలికేందుకు రెడీ అయ్యారని పేర్కొన్నారు. సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, నిజామాబాద్ అర్బన్, బాన్సువాడ, ఎల్లారెడ్డి అభ్యర్థులు షబ్బీర్‌అలీ, ఏనుగు రవీందర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావ్, మాజీ ఎమ్మెల్యేలు యూసుఫ్‌అలీ, ఈరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందుప్రియ, జెడ్పీటీసీలు మోహన్‌రెడ్డి, తిర్మల్‌గౌడ్, భిక్కనూరు ఎంపీపీ గాల్‌రెడ్డి, నేరెళ్ల శారద, తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పండ్ల రాజు, మక్సూద్, పల్లె రమేశ్‌గౌడ్, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, గోనె శ్రీనివాస్, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన అభ్యర్థులు రవీందర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, షబ్బీర్ అలీ

జంగ్ తెలంగాణ

తరలి వచ్చిన జనం

రాహుల్ సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. సభకు వేలాది మంది జనం తరలివచ్చారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వాహనాల్లో భారీగా జనం రావడంతో డిగ్రీ కాలేజీ గ్రౌండ్ కిక్కిరిసిపోయింది. కొత్త బస్టాండ్ నుంచి కాలేజీ గ్రౌండ్‌వరకు రోడ్డు జనంతో నిండిపోయింది. కాగా రాహుల్ సభ సందర్భంగా వేదిక వైపునకు జనం తోసుకురాకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాటినిదాటి పోకుండా ప్రత్యేక బలగాలతో కట్టడి చేశారు. రాహుల్‌గాంధీ మధ్యాహ్నం 3.43 గంటలకు సభా వేదికపైకి చేరుకుని సుమారు 23 నిమిషాలు మాట్లాడారు. 4.06 గంటలకు ప్రసంగాన్ని ముగించుకుని కిందికి వెళ్లిపోయారు. తర్వాత రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా మళ్లీ వచ్చి సభలో కూర్చోవడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ కామారెడ్డి నియోజకవర్గం పేరుకు బదులుగా కరీంనగర్ అంటూ మూడుసార్లు ప్రస్తావించారు. దీంతో సభికులు ఆశ్చర్యపోయారు.

కేసీఆర్‌కు ఓటమి భయం..



మాట్లాడుతున్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

రాష్ట్రంలో కేసీఆర్‌కు కాంగ్రెస్‌ను చూసి ఓటమి భయం పట్టుకుందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. బంగారు తెలంగాణలో 4 కోట్ల ప్రజలను మోసం చేసిన కేసీఆర్‌ను కామారెడ్డిలో ఓడించే అవకాశం వచ్చిందన్నారు. కేసీఆర్ రెండు చోట్లా ఓడిపోవడం ఖాయమన్నారు. కేసీఆర్ నమ్మక ద్రోహి అని, తెలంగాణ ఇస్తే కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని చెప్పి వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. కేసీఆర్‌ను ఓడించి పర్మినెంట్‌గా ఫాంహౌజ్‌కు పరిమితం చేయాలని ప్రజలను కోరారు. బీజేపీకి ఓటు వేసి వృథా చేసుకోవద్దన్నారు. రాష్ట్రంలో, కామారెడ్డిలో జరుగుతున్న ఎన్నికలు దేశం మొత్తంపై ప్రభావం చూపుతాయన్నారు. కామారెడ్డిలో రేవంత్‌రెడ్డికి 25 వేల మెజారిటీ ఇవ్వాలని ఓటర్లను కోరారు.



సభలో పాల్గొన్న ప్రజలు

ఎన్నికల సిబ్బంది కోసం ఫెసిలిటేషన్ కేంద్రాలు

కామారెడ్డి క్రైం: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకోడానికి జిల్లా కేంద్రంలో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో, కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉన్న వారు పోస్టల్ బ్యాలెట్ కోసం చేసుకున్న దరఖాస్తులను సంబంధిత జిల్లాలకు పంపించామన్నారు. వారంతా కలెక్టరేట్‌లోని 25 నంబరు గదిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను ఈ నెల 27లోగా ఉపయోగించుకోవాలన్నారు. సందేహాల నివృత్తి కోసం 9494261915, 9052465700 నంబర్లకు సంప్రదించాలన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ పాటిల్

మద్యం దుకాణాలు బంద్

- తెరిచిన షాపుల్లో నో స్టాక్ బోర్డులు
- బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా అమ్మకాలు
- పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ అధికారులు

బాన్సువాడ: ఒక వైపు అసెంబ్లీ ఎన్నికలు, మరో వైపు పెళ్లిళ్ల సీజన్.. ఈ సమయంలో మద్యం నిల్వలతో నిండుగా ఉండాల్సిన వైన్ షాపులు స్టాక్ లేక వెలవెలబోతున్నాయి. ఈ నెలాఖరుతో లైసెన్స్ గడువు ముగుస్తుండడం, ఎన్నికలకు మూడు రోజుల ముందే మద్యం దుకాణాల మూసివేయాలనే నిబంధన.. మద్యం నిల్వలు లేకపోవడానికి ప్రధాన కారణమని చెప్పవచ్చు. వైన్ షాపుల్లో నో స్టాక్ బోర్డులు చూసి మద్యం ప్రియులు అవాక్కవుతున్నారు. ఇదే అదునుగా భావించిన బెల్టుషాపుల నిర్వాహకులు ఇతర ప్రాంతాల నుంచి మద్యం తీసుకువచ్చి ఇష్టారాజ్యాంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బాన్సువాడ పట్టణంలో నాలుగు మద్యం దుకాణాలు ఉండగా వాటి దగ్గర వారం రోజులుగా నో స్టాక్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. సిండికేట్‌గా ఉన్న దుకాణాల నిర్వాహకులు స్టాక్‌ను బెల్టు షాపులకు తరలించి, అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



బీర్కూర్‌లో నో స్టాక్ బోర్డు ఉన్న మద్యం దుకాణం

ఎన్నికల కోడ్ అమలులో భాగంగా బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు నిషేధించారు. అయినప్పటికీ బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వారం రోజులుగా వైన్ షాపుల్లో మద్యం విక్రయాలు నిలిపివేయడంతో బెల్టుషాపుల్లో మద్యం ధరలకు రెక్కలు వచ్చినట్లు మద్యం ప్రియులు చెబుతున్నారు. ఎమ్మార్పీపై 20 శాతం అధిక ధరలతో బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.


ప్రతి గుంటకూ నీరందిస్తాం

- యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తా
- రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేయించా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో జాజాల సురేందర్

సాక్షి, కామారెడ్డి: 'వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రతి గుంటకూ నీరందించి సాగునీటి కష్టాలు తీర్చడమే నా లక్ష్యం' అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో నియోజకవర్గంలో ప్రచార తీరుతెన్నులు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణ గురించి ఆయన వివరించారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. స్థానికుడినైన తాను ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించానని పేర్కొన్నారు. ప్రజలు తనను భారీ మెజారిటీతో గెలిపిస్తారన్న ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 22వ ప్యాకేజీ పనులు పూర్తిచేయించి అన్ని ప్రాంతాలకు సాగు నీరు అందిస్తామన్నారు. దీని ద్వారా పోచారం ప్రాజెక్టు 365 రోజులు నిండుకుండలా మారబోతుందన్నారు.

కేసీఆర్ భరోసాకు ఆదరణ

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాగానే అమలు చేసే కేసీఆర్ భరోసా పథకాలకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోంది. ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయి. వారందరూ ఎంతో ఆదరిస్తున్నారు. కళ్యాణలక్ష్మి పథకం ద్వారా దాదాపు పన్నెండు వేల మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం సాయం అందించింది. నేను సొంత డబ్బులతో అన్న కానుకగా చీరలు అందించాను. వాళ్లంతా నన్ను సొంత అన్నలా భావిస్తున్నారు.



యువత కోసం..

నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి వారికి వివిధ అంశాల్లో శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నదే నా లక్ష్యం. అందుకు అవసరమైన ప్రణాళికలు నా దగ్గర ఉన్నాయి. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి కోచింగ్ ఇప్పించి ప్రోత్సహించాను. సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన నాకు యువత కష్టాలు తెలుసు. వారి కోసం నావంతు చేయాల్సిందంతా చేస్తా.

మరోసారి విజయం సాధిస్తా

నియోజకవర్గంలో ఏ ఊరికి వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారు. వారి ఆదరణ చూస్తుంటే భారీ మెజారిటీతో గెలుస్తానన్న నమ్మకం పెరిగింది. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాను. కామారెడ్డి నుంచి సీఎం పోటీ చేస్తుండడంతో వచ్చే ఐదేళ్లలో మరింతగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం దొరికింది. నియోజకవర్గాన్ని అన్నింటా అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా.

ఎల్లారెడ్డి పట్టణాభివృద్ధికి కృషి చేశా

ఎల్లారెడ్డి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి రూ.75 కోట్లు నిధులు తీసుకువచ్చా. వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయించా.. పనులు నడుస్తున్నాయి. నిరాదరణకు గురైన బస్టాండ్‌ను కూల్చివేయించి కొత్త బస్టాండ్ పనులు మొదలుపెట్టాం. పనులు కళ్ల ముందు కనిపిస్తున్నా కొందరు ఏవేవో మాట్లాడుతారు. వాటిని పట్టించుకోకుండా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు నడిచాను. ఎల్లారెడ్డి పెద చెరువు కట్ట వద్ద వంతెనలు నిర్మించి ప్రజలు కష్టాలను తీర్చాను.

పెద్ద ఎత్తున నిధులు తెచ్చా..

ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎంతో వెనుకబడి ఉన్న పరిస్థితుల్లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఇతర మంత్రుల సహకారంతో అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చాను. రూ.వందల కోట్లతో పనులు జరిగాయి. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఎన్నో రోడ్లను వేయించాను. బుగ్గగండి రోడ్డు దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోలేదు. నేను వెంటపడి సాధించాను. గ్రామీణ ప్రాంతాలు, తండాలకు తారు రోడ్లు వేయించాను. వాగుల మీద వంతెనలు లేక ఇబ్బందులు పడ్డ పరిస్థితులను అధిగమించేందుక వంతెనలు మంజూరు చేయించాను. గాంధారి మండల కేంద్రంలో రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు నిర్మించాను.

జుక్కల్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించండి

- కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే గంగారాం పిలుపు
- టికెట్టు దక్కకపోవడంతో ఆవేదన

పెద్దకొడప్‌గల్: జుక్కల్ నియోజకవర్గంలో తనను అభిమానించేవారంతా కారు గుర్తుకు ఓటేయాలని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ను 46 ఏళ్లపాటు నమ్మి సేవలందించిన తనకు కాకుండా కొత్తగా వచ్చినవారికి టికెట్టు ఇచ్చి మోసం చేశారన్నారు. ఎస్సీ నియోజకవర్గంలో దళితుడైన తనకు కాకుండా మున్నూరు కాపు అయిన లక్ష్మీకాంత్‌రావ్‌కు ఇవ్వడం సరికాదన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో సుదర్శన్‌రెడ్డి వేయికోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, గతంలో పార్టీ ఎంపీ అభ్యర్థిని ఓడించేందుకు టీడీపీతో చేయి కలిపారని ఆరోపించారు. అలాంటి వ్యక్తికి టికెట్టు ఇచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం తనకు మాత్రం ఇవ్వకపోవడం దారుణమన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో తన పని అయిపోయిందని ప్రచారం చేస్తున్న వారికి బుద్ధిచెబుతానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంత్‌రావ్‌ను ఓడించేందుకు బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగారాం

ఆరేళ్ల పాటు వేటు..

సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాంపై సస్పెన్షన్ వేటు పడింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకుగాను ఆరేళ్లపాటు బహిష్కరిస్తూ పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జుక్కల్ టికెట్టు ఆశించిన గంగారామ్‌కు నిరాశ ఎదురైన విషయం తెలిసిందే.. ఆయనకు బదులు తోట లక్ష్మీకాంత్‌రావ్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిపింది. దీంతో గంగారాం రెబల్‌గా నామినేషన్ దాఖలు చేశారు. తర్వాత పార్టీ నేతల చొరవతో నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. అయితే ఇటీవల పార్టీ అభ్యర్థి స్థానికేతరుడని, ఆయనకు బదులు బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటేయాలంటూ పార్టీ శ్రేణులకు చెప్పిన మాటలకు సంబంధించిన ఆడియో వైరల్ అయ్యింది. ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని తన అనుచరులకు పిలుపునిచ్చారు. దీంతో స్పందించిన పార్టీ ఆయనపై చర్యలు తీసుకుంది. మాజీ ఎమ్మెల్యే గంగారాం బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయడం, కాంగ్రెస్ నాయకత్వం ఆయనపై సస్పెన్షన్ వేటు వేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

నేహాకు ఘన స్వాగతం



మోపాల్: మండలంలోని మంచిప్పకు చెందిన ఎస్‌కే నేహా అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో రజత పతకం సాధించి స్వగ్రామానికి రావడంతో ఆదివారం రాత్రి ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. నేహా ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు రష్యాలో నిర్వహించిన అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందూరి సిద్ధార్థ మాట్లాడుతూ.. మారుమూల గ్రామానికి చెందిన నేహా అంతర్జాతీయ స్థాయిలో రాణించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నేహాను అభినందించారు. అదేవిధంగా నేహా కోచ్ అదే గ్రామానికి చెందిన దేవేందర్ కావడంతో ఆయనను కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు నవీన్, కో ఆప్షన్ అజీమ్, ఉపసర్పంచ్ జగదీశ్, సాయిరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు'



దోమకొండ: కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఆదివారం దోమకొండ మండల కేంద్రంలో ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముదిరాజ్‌లకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతూ బీసీ–డీ నుంచి ఏ గ్రూపులోకి మార్చడానికి సీఎం కేసీఆర్ అంగీకరించారన్నారు. రాజకీయ, నామినేటెడ్ పోస్టుల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పిస్తానని మాట ఇచ్చారన్నారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు చినంగి వెంకటేషం, శ్రీనివాస్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రచారం



కామారెడ్డి టౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆర్ తరఫున 7, 8వ వార్డులో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఇంటింటా బీఆర్‌ఎస్ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కామారెడ్డి అభివృద్ధి కోసం కేసీఆర్ గెలవాలని ఓటర్లకు వివరించారు. పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు జోరుగా ప్రచారం చేశారు. కౌన్సిలర్లు నిట్టు కృష్ణమోహన్, భూక్యారాజు, గెరికంటి స్వప్న, నాయకులు లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

పోచారంను భారీ మెజార్టీతో గెలిపించాలి



బాన్సువాడ రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బాన్సువాడ ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి కోరారు. ఆదివారం బోర్లం గ్రామంలో సర్పంచ్ సరళా శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ శ్రావణీ దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింలుతో కలిసి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. నియోజకవర్గ అభివృద్ధికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన సేవలను వివరిస్తూ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి గ్రామంలో బాజాభజంత్రీలతో భారీ ర్యాలీ చేపట్టారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

- సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ అగ్రగామి
- బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డి



దేశాయిపేట్‌లో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సోమేశ్వర్, దేశాయిపేట్, పోచారం, మొగులాన్‌పల్లి, కాద్లాపూర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు.

సీఎం కేసీఆర్ అందించిన సహకారంతో బాన్సువాడను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దానన్నారు. తెలంగాణలో ఏ నియోజకవర్గంలో లేనన్ని డబుల్‌బెడ్‌రూం ఇళ్లు బాన్సువాడలో నిర్మించామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ సీఎం కాగానే మిగిలి ఉన్న పనులన్నీ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కారుగుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు. ఆలిండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు బద్యానాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మోహన్‌నాయక్, సర్పంచ్‌లు పద్మ మొగులయ్య, మోరీల్ శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కల్లు తాగిన పోచారం

బాన్సువాడ : బాన్సువాడ మండలం దేశాయిపేట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా కార్యకర్త భూషణ్ గౌడ్ చెట్టు నుంచి తీసుకువచ్చిన కల్లుబొబ్బా(కల్లు కుండ)ను తీసుకువచ్చి పోచారం శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. దీంతో కల్లు తాగి..కల్లు ఇచ్చిన వ్యక్తిని అభినందించారు.

గట్టుమీది గ్రామాల్లో బీఆర్‌ఎస్ భారీ ర్యాలీ

బాన్సువాడ రూరల్: కోనాపూర్, కాద్లాపూర్, సంగోజీపేట్, హన్మాజీపేట్ తదితర గ్రామాల మీదుగా ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో డీసీసీబీ చైర్మన్ భారీ ర్యాలీ తీశారు. సిద్దాపూర్ రిజర్వాయర్ కావాలి– పోచారం రావాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోచారం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.200 కోట్లతో ప్రారంభించిన సిద్దాపూర్ రిజర్వాయర్ పూర్తయితే 14 వేల ఎకరాలకు రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు వస్తాయన్నారు. డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాం నాయక్, కోనాపూర్, సంగోజీపేట్ సర్పంచ్‌లు రమణరావు, ఈడ్గి లక్ష్మీ శంకర్‌గౌడ్, ఎంపీటీసీలు హన్మాండ్లు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టణంలో పోచారం కోడలి ప్రచారం

బాన్సువాడ : పట్టణంలోని 19 వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంజిరెడ్డిలతో పాటు ఆయా కాలనీల బూత్‌స్థాయి ఇన్‌చార్జ్‌లు, కౌన్సిలర్లు విస్తృత ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిన్న కోడలు సోనిరెడ్డి పలు కాలనీల్లో ప్రచారం చేసి మామకు ఓటేయాలని కోరారు.



ర్యాలీలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బాధ్యతగా విధులు నిర్వహించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి ఉండే నిశ్శబ్ద కాలం (సైలెన్స్ పీరియడ్) అత్యంత కీలకమని, అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో సూచించారు. పోలింగ్‌కు 72 గంటలు, 48 గంటల ముందు పాటించాల్సిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ నెల 30 న సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగియనుందన్నారు. అంతకు 48 గంటల ముందు నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. ఐదుగురికి మించి ఒక చోట గుమికూడరాదన్నారు. అక్రమ మద్యం తయారీపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. స్వాధీనర చేసుకున్న మద్యం వివరాలను ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ప్రచారం చేయొద్దని పేర్కొన్నారు. ప్రచార సమయం ముగిసిన వెంటనే ఇతర నియోజకవర్గాల వారు వెళ్లిపోవాల్సి ఉంటుందన్నారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్టులను మరింత పటిష్టం చేసి తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో తరలించడం, ప్రలోభాలకు గురి చేయడం నేరమన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీలకు విశేష స్పందన



బాన్సువాడ రూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని కాంగ్రెస్ బాన్సువాడ అభ్యర్థి ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం టీపీసీసీ సభ్యులు కాసుల బాలరాజుతో కలిసి బోర్లం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్ని హామీలు వెంటనే నెరవేరుస్తామన్నారు. ప్రజలు చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. నాయకులు సతీష్‌గౌడ్, జనార్దన్‌గౌడ్, మన్నె విఠల్, మంద సాయిలు, టేకుల మొగులయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో అన్నివర్గాలకు మేలు

- మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావ్ చవాన్



మేనూర్‌లో మాట్లాడుతున్న అశోక్‌రావ్ చవాన్

మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తే కచ్చితంగా అమలు చేసి తీరుతుందని మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావ్ చవాన్ పేర్కొన్నారు. మేనూర్‌లో ఆదివారం మహారాష్ట్రకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు జుక్కల్ కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావ్‌కు మద్దతుగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చవాన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. జుక్కల్ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

'సౌదాగర్‌తో ఎలాంటి ఉపయోగం లేదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత మహేందర్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయమనడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ సౌదాగర్ గంగారాంకు తొమ్మిది సార్లు అవకాశం ఇస్తే ఐదు సార్లు ఓటమిపాలయ్యారని తెలిపారు. ఆయన నుంచి కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఉపయోగం కూడా లేదని, ఆయన మాత్రం రూ.వేల కోట్లు సంపాదించుకున్నాడని ఆరోపించారు. గంగారాం, హన్మంత్ సింధే ఇద్దరూ ఇసుక దొంగలేనని విమర్శించారు. కార్యకర్తలు హస్తం గుర్తుకు ఓటు వేసి లక్ష్మీకాంతరావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చిప్ప మోహన్, మల్లప్ప పటేల్, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారిన వారికి బుద్ధి చెప్పాలి



సిద్ధాపూర్‌లో మాట్లాడుతున్న పోచారం

వర్ని: ఎన్నికల సమయంలో తనకు ద్రోహం చేసి పార్టీ మారిన వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిద్ధాపూర్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. హనుమాజీపేట్, సిద్ధాపూర్ సర్పంచులు తమ స్వప్రయోజనాల కోసం పార్టీ మారారని వారికి ఓటర్లు గుణపాఠం చెప్పాలన్నారు. రూ. కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసినా విశ్వాసం చూపకుండా పార్టీ మారారని ఆవేదన వ్యక్తం చేశారు. భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. పార్టీ మారిన సర్పంచులు, నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పి కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్ రాకుండా చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి ఏమాత్రం పాటుపడని కాంగ్రెస్, బీజేపీలకు ఎందుకు ఆకర్షితులు అవుతున్నారని ప్రశ్నించారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని సిద్ధాపూర్ రిజర్వాయర్, చందూరు, జాకోరా లిఫ్ట్ ఇరిగేషన్లను మంజూరు చేయించి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి భూములతో పాటు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. సభలో జెడ్పీటీసీ హరిదాసు, సిద్ధాపూర్ మాజీ సర్పంచ్ భారతీ నాయక్, నాయకులు వీర్రాజు, కిషన్, గోపాల్, గిరి, బాల్ సింగ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఐటీ రంగం అభివృద్ధి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ ఫోరం సభ్యుడు కిశోర్‌రెడ్డి

ఎల్లారెడ్డి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఐటీ రంగం ఎంతో అభివృద్ధిని సాధించిందని బీఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ సభ్యుడు లొంకలపల్లి కిశోర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ ఎన్ఆర్ఐలు వారి వారి ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని ఆదేశించడంతో ఎల్లారెడ్డిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వచ్చామన్నారు. గత పదేళ్లలో ఐటీ రంగంలో తెలంగాణ ఎంతో ప్రగతి సాధించిందన్నారు. హైద్రాబాద్‌లో గూగుల్, అమెజాన్ బ్రాంచీల ఏర్పాటు దీనికి ఉదాహరణ అని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రాష్ట్రం మరో పదేళ్లు వెనక్కి వెళ్లినట్లేనని అన్నారు. మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, ఎల్లారెడ్డి సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవకుడిగా ఉంటా

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్



తాడ్వాయిలో గజమాలతో మదన్‌మోహన్‌ను సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా ఉంటానని, చేతి గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ ఓటర్లను కోరారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు దేమికలాన్, కన్‌కల్, కరడ్‌పల్లి గ్రామాలలో ఆదివారం గడపగడపకు తిరుగుతూ ప్రచారం చేశారు. తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పాత బస్టాండ్ వరకు బోనాలు, డప్పువాయిద్యాలతో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రజలు చందాలు వేసుకొని సురేందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వారికి ఎలాంటి సేవ చేయలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందడం లేదని విమర్శించారు. తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్‌లో చదివిన వాడిని, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో తిరిగి కష్టసుఖాలు తెలుసుకొని పలు సేవ కార్యక్రమాలు చేపట్టానన్నారు. కరోన సమయంలో వైద్య సేవలు అందించి వందలాది మంది ప్రాణాలను కాపాడనని, జాబ్ మేళాలను ఏర్పాటు యువతకు ఉద్యోగాలు ఇప్పించానని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాబోయే ప్రభుత్వం కాంగ్రెస్సేనని, మరిన్ని ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు వెంకట్‌రాంరెడ్డి, జంగంరాజు, శ్యాంరావు, సుగుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటుకు వారు దూరమే..

- ఓటు హక్కుకు నోచుకోని ప్రవాసులు
- జిల్లా నుంచి గల్ఫ్‌కు వెళ్లిన వారు 2.90లక్షల పై మాటే

మోర్తాడ్: ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన ప్రవాసులకు ఓటు హక్కు వినియోగించుకునే వీలు లేకుండా పోతోంది. వయోవృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ సిబ్బందికి, దేశ భద్రతను కాపాడుతున్న సైనికులకు సర్వీస్ ఓటింగ్ విధానం అమలు చేస్తున్న ఎన్నికల కమిషన్ ప్రవాసుల విషయంలో ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేకపోయింది. ఫలితంగా జిల్లాలో దాదాపు 2.90 లక్షల మంది గల్ఫ్ వలస కార్మికులతో పాటు ఇతర దేశాల్లో ఉంటున్న వారు ఓటు హక్కుకు దూరమవుతున్నారు. విదేశాల్లో ఆన్‌లైన్ ఓటింగ్ విధానం అమలులో ఉంది. పోలింగ్ బూత్‌కు స్వయంగా వెళ్లి ఓటు వేయని వారు ఆన్‌లైన్‌లో ఓటింగ్‌కు పాల్గొనడానికి దరఖాస్తు చేసుకుంటే ఆయా దేశాల్లో ఓటింగ్ సౌకర్యం కల్పిస్తోంది.

మన దేశంలో వలస కార్మికుల కోసం ప్రాక్సీ ఓటింగ్ విధానం అమలు చేయడానికి గతంలో కసరత్తు చేశారు. సాంకేతిక కారణాలతో ఈ విధానం అమలులోకి రాకముందే స్వస్తి పలికారు. ప్రాక్సీ ఓటింగ్ విధానం అమలులోకి వచ్చి ఉంటే గల్ఫ్ దేశాల్లో ఉన్న వలస కార్మికులతో పాటు ఇతర దేశాల్లో ఉపాధి పొందుతున్న ప్రవాసులకు ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలు ఉండేది. కనీసం రానున్న స్థానిక సంస్థల, పార్లమెంట్ ఎన్నికల సమయంలోనైనా వలస కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకునే వీలు కల్పించేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వలస ఓట్లను గుర్తించాలి



వలస కార్మికుల ఓట్లను ఎన్నికల కమిషన్ గుర్తించాలి. కొంత మంది ఓట్లు తొలగించినా అనేక మంది ఓట్లు అలాగే ఉన్నాయి. వలస కార్మికులు ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి. అలా జరిగితేనే సమస్యలు పరిష్కారం అవుతాయి.

– తోట రమేశ్, బాబాపూర్

ఎన్నికల కమిషన్ స్పందించాలి



ప్రవాసుల ఓటు హక్కు వినియోగంపై ఎన్నికల కమిషన్ స్పందించాలి. ప్రవాసులు తమ ఓటు హక్కును ఏదో విధంగా వినియోగించుకుంటే రాజకీయ పార్టీలు ప్రవాసుల కోసం ఏదో ఒక పథకం అమలు చేస్తాయి. ప్రవాసుల హక్కులను కాలరాయద్దు.

– మంద భీంరెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాచారెడ్డి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఘన్‌పూర్ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా గజసింగవరం గ్రామానికి చెందిన పంతం సుమన్(35) సొంత పనినిమిత్తం మాచారెడ్డికి వచ్చాడు. తిరిగి రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా ఘన్‌పూర్ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మల్లూర్ శివారులో రెండు ట్రాన్స్ ఫార్మర్లను దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేసి కాపర్‌వైర్లు, ఆయిల్‌ను చోరీ చేశారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంతో సుమారు. రూ. లక్ష నష్టం కలిగినట్లు బాధిత రైతులు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్‌కు చెందిన శాదుల్ (20) గ్రామ శివారు గుట్టలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై మురళి ఆదివారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన శాదుల్ కట్టెలు తీసుకురావడానికి సమీపంలోని గుట్టకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. కుటుంబ సభ్యులు ఆదివారం గుట్టపై పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి ముఖానికి గాయాలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం స్వాధీనం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుందాల్ సింగ్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రం నుంచి విఠల్‌వాడి తండాకు మద్యం తీసుకెళ్తున్న ఒకరిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై మమత, బిచ్కుంద ఎస్సై అభిషేక్, సిబ్బంది ఉన్నారు.

జాతీయ రహదారిపై జింక మృతి



మద్నూర్: మండల సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జింక మృతి చెందింది. గమనించిన ప్రయాణికులు అధికారులకు సమాచారం అందించారు. వన్యప్రాణులు ఉన్న చోట రోడ్డుపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

నృసింహుడికి భక్తితో..



భీమ్‌గల్: మండల కేంద్రంలోని లింబాద్రి గుట్టపై నిర్వహించిన శ్రీ లక్ష్మీనృసింహుని రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా సాగింది. జయ జయ గోవింద భక్తుల ధ్వానాల మధ్య నంబి వంశస్తులు, వేద పండితులు ఘనంగా రథోత్సవం నిర్వహించారు. రథంపై స్వామి వారిని ఉంచి ఊరేగించారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



రథోత్సవానికి హాజరైన మంత్రి వేముల